నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిళ్లగూడెం, జనవరి 4 : ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టీజీఎన్‌పీడీసీఎల్ ఖమ్మం టౌన్-1 ఏడీఈ నాగార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం టౌన్‌వన్ సెక్షన్ పరిధిలో గాంధీచౌక్ సబ్‌స్టేషన్‌లోని 11కేవీ గుట్టలబజార్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి 11గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. గాంధీచౌక్, రైల్వేస్టేషన్ రోడ్డు, సుందర్ థియేటర్, ఆంధ్రాబ్యాంక్, మోహన్‌రోడ్డు, వాసవీనగర్, జహీర్‌పురతండా, కిన్నెరసాని ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు. టౌన్-5 సెక్షన్‌లో 33కేవీ రామాలయం ఫీడర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. రామాలయం, రిక్కాబజార్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

మామిళ్లగూడెం, జనవరి 4 : ఖమ్మం నగరంలోని టౌన్-2 ఏడీఈ పరిధి విద్యుత్ వినియోదారుల సదస్సును ఈ నెల 6వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎన్‌వీ వేణుగోపాలచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించాలని సూచించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

రేపు ఆర్గానిక్ మేళా

ఖమ్మం వ్యవసాయం, జనవరి 4: గ్రామ భారతి, తెలంగాణ శ్రీపుష్టి ఆర్గానిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న సమీకృత మార్కెట్ ఆర్గానిక్ మేళా (మూలం సంత) జరగనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బయో ఎంజేమ్స్, వేప పళ్లపొడి, ఖాదీ చేనేత వస్త్రాలు, మట్టిపాత్రలు, మట్టి ఆభరణాలు, ఆయుర్వేద మూలికలు, కుల, చేతివృత్తులు, చిరుధాన్యాలు వంటి స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి నెలలో మొదటి ఆదివారం ఈ ఆర్గానిక్ మేళా జరగనున్నది.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

మామిళ్లగూడెం, జనవరి 4: జిల్లాలో వివిధరంగాల్లో కార్మికులుగా పనిచేస్తున్న వారి పిల్లలు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ కె.విజయ భాస్కర్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటార్ రవాణ సంస్థలు, సహకార సంస్థలు, ఇతర ట్రస్ట్‌ల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు ప్రతి ఆధారంగా ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఐటీఐ కోర్సులు ఉత్తీర్ణులైన వారికి రూ.1000, పాలిటెక్నిక్ కోర్సుకు-1500, ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్‌సీ, బీసీఏ, ఎంసీఏ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీబీఏ, ఎంబీఏ, డిప్లోమా, పీజీ డిప్లోమా ఇన్ మెడికల్ లాబోరేటరి టెక్నిషియన్ కోర్సుల్లో ఉత్తర్ణులైన వారికి రెండు వేల రూపాయల ఉపకార వేతనం చెల్లించనున్నట్లు వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు మేడే నాటికి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 15వ తేదీలోపు జిల్లా కార్మికశాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలి

మామిళ్లగూడెం, జనవరి 4: ప్రజలు అత్యవసర సమయంలో సహాయం పొందేందుకు డయల్ 100కు కాల్ చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శనివారం ప్రకటన లో కోరారు. గత 2024 డిసెంబర్‌లో 4,134 కాల్స్ వచ్చాయని తెలిపారు. వాటిలో 107 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వీటిలో మహిళల వేధింపులు-1, దొంగతనాలు-14, సాధారణ ఘాతుకాలు-32, యాక్సిడెంట్లు-24, అనుమానాస్పద మరణాలు-5, ఇతర కేసులు 31 వరకు ఉన్నాయన్నారు. అవగాహన లేని కొందరు తప్పుడు కాల్స్ చేస్తున్నారని, అత్యవసర సమయంలో మాత్రమే కాల్ చేసి సహాయం పొందాలని సూచించారు.

11 నుంచి టీసీసీ పరీక్షలు

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 4 : విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్(టీసీసీ) కేటగిరిల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్‌లో పొందాలని సూచించారు.

నాయీబ్రాహ్మణుల బైక్ ర్యాలీ

ఖమ్మం, జనవరి 4 : ఖమ్మం పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఎన్నికల శంఖారావం మోగింది. ఖమ్మం పట్టణ సంఘ ఎన్నికల్లో అధ్యక్ష కార్యదర్శులుగా యలమందల జగదీష్, గుండ్లపల్లి శ్రీనివాస్ పోటీ చేసేందుకే నామినేషన్ ప్రక్రియలో భాగంగా ఖానాపురంలోని శ్రీ అభయ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పూజలు నిర్వహించారు. అనంతరం నగర ప్రధాన కూడళ్ల మీదుగా 200 మోటార్ సైకిళ్ళతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల రాము, సురభి సైదులు, విజయ్, కృష్ణ, నరసింహారావు, కోటయ్య, నరేశ్, శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభలను విజయవంతం చేయాలి

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 4 : యూటీఎఫ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, వెంకట్ పిలుపునిచ్చారు. శనివారం మంచికంటి భవన్‌లో వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రంజాన్, నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, వెంకన్న, షమీ పాల్గొన్నారు.

గీతాంజలి విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 4 : ఖమ్మం నగరంలోని గీతాంజలి పాఠశాల విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ టీవీ అప్పారావు శనివారం తెలిపారు. ఆలిండియా మై చాంప్ టాలెంట్ టెస్ట్‌లో స్టేట్ 2వ ర్యాంక్‌ను నాగసాత్విక్, భువన ఆదర్శ్, 5వ ర్యాంక్‌ను నిత్యశ్రీ, 6వ ర్యాంక్ విశ్వక్‌తేజ్ సాధించారు. విద్యార్థులను డైరెక్టర్స్ టీ పద్మ, టీ అరుణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన సోషల్ టాలెంట్ టెస్ట్

తెలంగాణ రాష్ట్ర సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలోని శాంతినగర్ పాఠశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలకు నగదు, మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో సోమశేఖరశర్మ, ఏఎంవో రవికుమార్, హెచ్ఎం కృష్ణకుమారి, సంఘం నాయకులు చల్లగాని కృపాబాలానందం, చంద్రశేఖర్, భీమరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఉద్యాన రైతు దంపతులకు సత్కారం

రామారావు దంపతులను సన్మానిస్తున్న అచ్చెంనాయుడు

ఖమ్మం వ్యవసాయం/ఖమ్మం రూరల్, జనవరి 4: జిల్లాలోనే అత్యుత్తమ ఉద్యాన పంటల సాగు రైతు, రైతునేస్తం అవార్డు గ్రహీత చెరుకూరి రామారావు దంపతులకు ఘన సత్కారం లభించింది. శనివారం ఏపీలోని గుంటూరులో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, రైతునేస్తం ఫౌండేషన్ సంయుక్తంగా సంక్రాంతి సంబురాల పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు పురస్కారాలు ప్రకటించింది. ఈ సందర్భంగా రామారావు దంపతులను పురస్కారం, అవార్డుతో ఘనంగా సత్కరించారు.

64 లక్షల ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే

నాలుగు రోజుల్లో మిగిలిన ఇండ్ల సర్వే పూర్తి
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, జనవరి 4: రాష్ట్ర వ్యాప్తంగా ఇందరిమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలనలో 80 లక్షల దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 64 లక్షల వరకు యాప్ ద్వారా అధికారులు సర్వే చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని లోక్యాతండా, కోక్యాతండా, లింగారాం తండాల్లో రూ. 54 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్లకు శనివారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మిగిలిన ఇండ్ల సర్వేను మరో నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో మొదటి వితడ నిరుపేదలకు ఇండ్ల పంపిణీ జరుగుతుందన్నారు. అనంతరం ధర్మాతండాలోని తిరుపతమ్మ గుడి వద్ద తిరుపతమ్మ మాల ధారణ చేసిన భక్తులు ఏర్పాటు చేసిన పీఠాన్ని ప్రారంభించి పూజలు చేశారు. సంక్రాంతి సందర్భంగా పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కూసుమంచి, నేలకొండపల్లి మండలాలకు చెందిన 106 మంది పేదలకు రూ.34 లక్షల విలువైన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహారావు, ఏసీపీ తిరుపతిరెడ్డి, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తంబూరి దయాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, నాయకులు స్వర్ణకుమారి, మల్లారెడ్డి, గోపాల్‌రావు, శ్రీనివాసరెడ్డి, సుధాకర్ రెడ్డి, సూర్యానారాయణరెడ్డి, వెంకటరెడ్డి, భద్రయ్య, ఉపేందర్, వీరభద్రం, పరశురాం, లింగారెడ్డి, ముత్తయ్య పాల్గొన్నారు.

లోక్యాతండాలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

స్త్రీ టీ క్యాంటిన్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, జనవరి 4: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డు తరుణిహాట్ వద్ద ఇందిర మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్త్రీ టీ క్యాంటిన్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురామరెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం క్యాంటిన్‌లో ఎంపీ, నాయకులతో కలిసి టీ తాగారు. కార్యక్రమంలో నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, బైరు హరినాదబాబు, కళ్లం వెంకటరెడ్డి, వెంపటి రవి, దండి రంగారావు పాల్గొన్నారు.

పార్లమెంటరీ టెలికాం అడ్వైజరీ కమిటీ ఎన్నిక

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ఎంపీ రఘురామిరెడ్డి

మధిర, జనవరి 4: నియోజకవర్గంలోని బోనకల్లు, ఎర్రుపాలెం మండలాలకు ఉమ్మనేని కృష్ణ, అమరవాది సత్యనారాయణరెడ్డికి ఖమ్మం పార్లమెంట్ టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమించారు. శనివారం ఖమ్మంలో ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టెలికాం శాఖ అధికారులు పాల్గొన్నారు.

టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా రామారావు


నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీ

వైరాటౌన్, జనవరి 4: టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా మచ్చా రామారావును నియమిస్తూ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. తనను ఈ పదవికి ఎంపికకు కృషి చేసిన ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వేంసూరు, జనవరి 4: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ వేంసూరు మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీని శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో సీహెచ్.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జీ.రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా కౌన్సిలర్ ఎన్.ఫకీర్, ఉపాధ్యక్షుడు ఐ.వెంకటేశ్వరరావు, కార్యదర్శులు రవికుమార్, టీ.ముత్తారవు, జీ.శివ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ టీ సెంటర్‌ను ప్రారంభించిన ఎంపీడీవో

స్త్రీ శక్తి క్యాంటిన్ ప్రారంభిస్తున్న ఎంపీడీవో

కూసుమంచి(నేలకొండపల్లి), జనవరి 4: మండల కేంద్రంలో ఇందిరా స్త్రీ టీం సెంటర్‌ను ఎంపీడీఓ ఈదయ్య శనివారం ప్రారంభించారు. మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకొని పోవాలనే లక్ష్యంతో ఇలాంటి వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆచార్లగూడెం నందిరి గ్రామ సమాఖ్య స్వర్ణలత, మహిళ సంఘాల బాధ్యులు స్వర్ణలత, ఏపీఎం అశోకరాణి, ఎంఈ చలపతిరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీలత, ఆర్ఐ మధు, పాండురంగారావు, సీసీలు, వీవోలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలను నివారించాలి

మానసిక వైద్య నిపుణులు రావులపాటి సతీశ్‌బాబు

మాట్లాడుతున్న సతీశ్‌బాబు

ముదిగొండ, జనవరి 4: విద్యార్థుల ఆత్మహత్యలను నివారించాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు రావులపాటి సతీశ్‌బాబు అన్నారు. విద్యార్థుల వరుస ఆత్మహత్యల నేపథ్యంలో వారిలో మానసిక ధైర్యం నింపేందుకు ముదిగొండలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. దేశంలో ఏటా 2.50 లక్షల మంది విద్యార్థులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షల్లో, ప్రేమలో ఫెయిల్యూర్ అనో, మత్తు పదార్థాలకు బానిసవ్వటం, అనేక చిన్న చిన్న కారణాలతో క్షణికావేశానికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు భావోద్వేగానికై లోనై అసహజంగా ప్రవర్తిస్తారనీ ఇలాంటి వారని గమణించి సున్నితంగా కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. తల్లిదండ్రులు, స్నేహితులు అప్రమత్తంగా ఉండటం ద్వారా ఆత్మహత్యలు నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్., సిబ్బంది వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ దొందూదొందే

మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

మధిర (చింతకాని), జనవరి 4: రైతులను మోసం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలైన బీజేపీ, కాంగ్రెస్ దొందుదొందేనని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక రాయల వీరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను, రైతులను మభ్యపెట్టి మాయమాటలు చెప్పటమే తంతుగా పెట్టుకొని ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, వత్సవాయి జానకీరాములు, నన్నక కృష్ణమూర్తి, బల్లి వీరయ్య, గడ్డం రమణ పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న ఎంఈవో

బోనకల్లు, జనవరి 4: ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎంఈవో దామాల పుల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని పెద్దబీరవల్లి పాఠశాల ఉపాధ్యాయుడు జల్లా సత్యనారాయణ ఉద్యోగ విరమణ పొందారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి విజ్ఞానాన్ని పెంపొందించిన సత్యనారాయణను నేటి ఉద్యోగులు ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చింతలచెరువు కోటేశ్వరరావు, కాంప్లెక్స్ హెచ్ఎం జీ.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం డీ.శారద, ఏఎంసీసీ చైర్మన్ మహబూబ్‌బీ, రైతుసంఘం, యువజన సంఘం, గిరిజన సంఘం, యూటీఎఫ్ నాయకులు, పంచాయతీ కార్యదర్శి టీ.రాము, ఫీల్డ్‌అసిస్టెంట్ గోపిలీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జీ శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్, జనవరి 4: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జీ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని విద్యాభారతి జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. డిజిటల్ ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు కొత్త న్యాయ చట్టాలు, కోర్టులు, విధులు, కోర్టుల్లో రకాలను వివరించారు. క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీ.లింగారెడ్డి, జూనియర్ న్యాయవాదులు అరుణకుమారి, రజిని, ప్రసాద్, పద్మ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విశిష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ

ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపేందర్‌రావు

వైరారూరల్, జనవరి 4: జీవీ మాల్, విశిష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గొల్లనపాడు పాఠశాల విద్యార్థులకు ఫౌండేషన్ కో ఆర్డినేటర్ పెనుగొండ ఉపేందర్‌రావు శనివారం ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అదేవిధంగా పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్న నరేష్‌కు నాలుగు జతల దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాములమ్మ, హెచ్ఎం పీ.వెంకటేశ్వర్లు, జీ.రామకృష్ణ, ఆర్.సాంబచారి, సీహెచ్.తిరుమలయ్య, బండారు సరిత, ఊటుకూరు శైలజ, మల్లెంపాటి చంద్రశేఖర్, మిట్టపల్లి భాస్కర్, కట్ల సురేశ్, నరేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ టాలెంట్‌టెస్టులో రేజర్ల జడ్పీ పాఠశాలకు మొదటి ర్యాంకు

బహుమతి అందుకుంటున్న విద్యార్థిని లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయురాలు కమలకుమారి

సత్తుపల్లి, జనవరి 4: తెలంగాణ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల సోషల్ టాలెంట్‌టెస్టులో మండలంలోని రేజర్ల జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రథమస్థానంలో నిలిచింది. శనివారం ఖమ్మంలో జరిగిన టాలెంట్ టెస్టులో పాఠశాలకు చెందిన పంతంగి లక్ష్మీప్రసన్న తెలుగు మీడియం విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది. పాఠశాల సోషల్ టీచర్ కమలకుమారిని, విద్యార్థిని నిర్వాహకులు, ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, హెచ్ఎం నాగమణి అభినందించారు.

ఇంగ్లిష్‌లో రేమిడిచర్ల విద్యార్థిని..

విద్యార్థి జావలిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం, జనవరి 4: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఖమ్మం ఆధ్వర్యంలో ఇంగ్లిష్ ఒలంపియాడ్ ఎగ్జామ్, ఉపన్యాస పోటీలు మండల స్థాయిలో నిర్వహించారు. పోటీల్లో రేమిడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి జావలి అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. ఈ నెల 18న జిల్లా స్థాయి పోటీలకు జావలి ఎంపికైంది. ఉపన్యాస పోటీల్లో కూడా జావలి మూడోస్థానం సాధించింది. జావలిని హెచ్ఎం కే.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, పద్మ, పుల్లమ్మ, రాంబాబు, ఫణికుమార్, సతీశ్, వజీర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

దివ్యాంగుల సేవా ఆశ్రమాన్ని సందర్శించిన డీఆర్‌డీవో

సత్తుపల్లిటౌన్, జనవరి 4: పట్టణంలోని సిద్ధారంరోడ్డులో గల స్వర్ణిక దివ్యాంగుల సేవా ఆశ్రమాన్ని నల్లబోతుల మంగయ్య మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు మంగయ్య కుమారుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఆర్‌డీవో నల్లబోతుల రవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు వలపర్ల రవికుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు ప్రసాద్, నిర్వాహకులు ఝాన్సీలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సందర్శించిన కమిషనర్

ఖమ్మం, జనవరి 4 : ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య శనివారం నగరంలోని గాంధీపార్కు, పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్న గ్రంథాలయాలను సందర్శించారు. అక్కడ పోటీ పరీక్షలకి ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు మాట్లాడుతూ లైబ్రరీ తెరవి ఉంచే సమయం పెంచాలని, గదిలో ఇంకొంచెం లైటింగ్ ఉండేలా చూడాలని తక్షణమే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. న్యూస్ పేపర్ చదివే వాళ్లందరి కోసం ప్రత్యేకమైన రూమును ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు.

రోడ్డు భద్రత.. మనందరి బాధ్యత

రఘునాథపాలెం, జనవరి 4: రోడ్డు భద్రత అనేది ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా రవాణాశాఖ అధికారి వాకదాని వెంకటరమణ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి వాహనదారులకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత, నూతన ఏఎంవీఐలు సుమ, లత పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కుటుంబానికి ఆర్థికసాయం

సత్తుపల్లి, జనవరి 4: మండలంలోని బేతుపల్లి గ్రామానికి చెందిన నూకా సుబ్రహ్మణ్యగుప్త మెదడు, గుండెజబ్బుతో ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సుబ్రహ్మణ్యం కుటుంబం ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న విషయాన్ని తెలుసుకున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు స్పందించి రూ.30 వేలు సేకరించి సుబ్రమణ్యం కుటుంబానికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వంకదారు వాసు, వందనపు వెంకటేశ్వరరావు, సుగ్గల బాబు, ముత్తా అబ్బులరావు, ముక్తేశ్వరరావు, ముత్తా సురేశ్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో జేవీఆర్ విద్యార్థి ప్రతిభ

సత్తుపల్లిటౌన్, జనవరి 4: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయిలో కరాటే పోటీల్లో సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్ఈపీఎస్ ఫస్టియర్ చదువుతున్న నడ్డి ప్రవీణ్‌కుమార్ ప్రతిభ కనబరిచాడు. జిల్లాస్థాయిలో మొదటిస్థానం సాధించడంతో పాటు, రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం సాధించాడు. ప్రవీణ్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ గోపి, అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

వైరాటౌన్, జనవరి 4: రోడ్డు రవాణా మాసోత్సవాల సందర్భంగా శనివారం వైరాలోని మధు పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదాల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వాహనాలు ఏ విధంగా నడపాలి, ట్రాఫిక్ సిగ్నల్స్ నిబంధనలు ఏ విధంగా ఉండాలి తదితర అంశాలపై వైరా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వర ప్రసాద్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ